# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో ఉపాధి కల్పనే ప్రధాన లక్ష్యంగా పారిశ్రామిక విధానాన్ని రూపొందించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "పల్లె పండుగ" పంచాయతీ వారోత్సవాలు ఈ రోజు ప్రారంభమయ్యాయి.

- నూతన మద్యం పాలసీ మేరకు మద్యం దుకాణాల కేటాయింపు కోసం ఈరోజు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో లాటరీ ప్రక్రియను చేపట్టారు.

- ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం రేపు మధ్యాహ్నం ప్రారంభం కానుంది.

- ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం రేపు మరింత బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==================================

రాష్ట్రంలో ఉపాది కల్పనే ప్రధాన లక్ష్యంగా పారిశ్రామిక విధానాన్ని రూపొందించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిలోని సచివాలయంలో పారిశ్రామికాభివృద్ధి, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, ఆహార శుద్ధి పరిశ్రమ రంగాలకు సంబంధించిన అధికారులతో ఈరోజు ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్క్రో అకౌంట్ ద్వారా పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ఆలోచిస్తున్నామని తెలిపారు. తద్వారా కంపెనీలకు జాప్యం లేకుండా ఎస్క్రో అకౌంట్ ద్వారా ప్రోత్సాహకాలు దక్కుతాయని.. ఇది పారిశ్రామిక ప్రగతికి, ఉద్యోగ కల్పనకు దోహదం చేస్తుందని అన్నారు. ఈ మేరకు సాధ్యాసాధ్యాలను, విధివిధానాలను సమగ్రంగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

==================================

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "పల్లె పండుగ" పంచాయతీ వారోత్సవాలు ఈ రోజు ప్రారంభమయ్యాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రాష్ట్రంలోని 13 వేల 326 గ్రామ పంచాయతీలకు సంబంధించిన పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం ఈరోజు శ్రీకారం చుట్టింది. 4 వేల 500 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 30 వేల పనులకు ఈ నెల 20వ తేదీ వరకూ జరగనున్న ఈ పంచాయతీ వారోత్సవాల్లో శంఖుస్థాపనలు చేసి సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ప్రధానంగా 3 వేల కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్లు, 500 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లు నిర్మించనున్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజక వర్గంలోని కంకిపాడు గ్రామంలో "పల్లె పండుగ" పంచాయతీ వారోత్సవాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి  కొణిదెల పవన్ కళ్యాణ్ లాంఛనంగా ప్రారంభించారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు మా ఆకాశవాణి ప్రతినిధి సునీల్ అందిస్తారు.

(వాయిస్ 17 సెకన్లు)

==================================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన "నూతన మద్యం పాలసీ" ప్రకారం మద్యం షాపుల కేటాయింపు కోసం ఈరోజు పలు జిల్లాల్లో లాటరీ ప్రక్రియను చేపట్టారు. 2024 - 26 కాలపరిమితికి గానూ వచ్చిన దరఖాస్తులను ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖ నిబంధనలకు అనుగుణంగా పరిశీలించిన అనంతరం లక్కీ డ్రా తీశారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విశాఖ జిల్లాలో ఈరోజు జరిగిన మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని మా ఆకాశవాణి ప్రతినిధి వి. సత్యనారాయణ మూర్తి అందిస్తారు...

(వాయిస్ 30 సెకన్లు)

==================================

వైద్య విద్యార్థులు విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ విద్యార్థులకు సూచించారు. ఈరోజు ఎంబిబిఎస్ తరగతుల ప్రారంభం సందర్భంగా పాడేరు వైద్య కళాశాలను కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించి, హాజరైన విధ్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు  జిల్లాలోని పాడేరు సురక్షిత ప్రాంతమని, అత్యంత ఆహ్లాదకర, ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు ఎటువంటి భయాందోళనలకు గురి కాకుండా వైద్య విద్యను అభ్యసించాలని కోరారు. అన్ని రకాలుగా రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం నుండే పాడేరు వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభించాలనే ఉద్దేశంతో 50 మందికి ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం ప్రవేశాలు కల్పించడం జరిగిందని పేర్కొన్నారు.

విరామం

==================================

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈరోజు ఉదయం ఏర్పడిన అల్ప పీడనం వాయువ్య దిశగా కదులుతూ.. రేపటికి మరింత బలపడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారి తెలియజేస్తూ....

(వాయిస్ 35 సెకన్లు)

==================================

రానున్న నాలుగు రోజుల పాటూ రాష్ట్రంలో భారీ కురుస్తాయన్న వాతావరణ  సమాచారం మేరకు జిల్లా కలెక్టర్లు, మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు శ్రవణమాధ్యమ సమావేశం నిర్వహించారు. భారీ వర్షాల నేపధ్యంలో చెరువులు, కాలువలు, నీటి వనరుల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా  అధికారులను

ఆదేశించారు. అతి భారీ వర్షాలు ఉండే ప్రాంతంలో ప్రజలకు ముందుగా మొబైల్ ఫోన్ల ద్వారా సమాచారం అందించి అప్రమత్తం చేయాలని.. చెరువులు, కాలువ కట్టల పరిరక్షణపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

====================================

ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా తొలేళ్ల సంబరాలు ఈరోజు విజయనగరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. కేంద్ర మాజీ మంత్రి, ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, విజయనగరం శాసన సభ్యురాలు అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి పైడితల్లి అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలను సమర్పించారు. రేపు జరగనున్న సిరిమానోత్సవాన్ని వీక్షించేందుకు లక్షలాది మంది భక్తులు చుట్టుపక్కల జిల్లాల నుంచి ఒడిశా రాష్ట్రం నుండి తరలివస్తారు. ఈ ఉత్సవాలకి సంబంధించి మరిన్ని వివరాలు మా ఆకాశవాణి ప్రతినిధి అన్వేష్ అందిస్తారు.

(వాయిస్ 34 సెకన్లు)

====================================

ఉపాధి కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రేపు పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "మినీ జాబ్ మేళా"ను నిర్వహించనున్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఆసక్తి కలిగిన వారు తమ వివరాలను https://skilluniverse.apssdc.in వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటూ బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లతో రేపు హాజరు కావాలని ఆ ప్రకటనలో పేర్కొంది.

====================================

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ హెచ్చరించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఎస్.ఎస్. శోభిక, పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవలతో కలిసి కలెక్టర్ ప్రజల నుండి 119 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చిన అర్జీలపై తగిన సమాచారం ఇవ్వదగిన అధికారులు మాత్రమే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరు కావాలని అన్నారు. ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిశీలిస్తూ.. త్వరితగతిన పరిష్కారాల కోసం కృషి చెయ్యాలని, లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

====================================
====================================